సాక్షి తిరుపతి

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025




పెదశేష వాహనంపై ఉభయ దేవేరీ సమేతంగా ఊరేగుతున్న మలయప్పస్వామివారు (ఇన్‌సెట్) పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు





ధ్వజపటం ఊరేగింపులో జీయర్‌స్వాములు, టీటీడీ ఈఓ



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు



ధ్వజస్తంభానికి మొక్కుతున్న ఉప రాష్ట్రపతి

విశేష విహారం

- అంగరంగ వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- శాస్త్రోక్తంగా ధ్వజారోహణం
- కనులపండువగా పెదశేష వాహన సేవ
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని వైభవంతో తిరుగిరులు విరాజిల్లుతున్నాయి. బ్రహ్మోత్సవ శోభతో దేదీప్యంగా కాంతులీనుతున్నాయి. ధ్వజ పటం తేజస్సుతో నూతన వెలుగులను సంతరించుకున్నాయి. గోవిందనామస్మరణలతో మార్మోగుతున్నాయి. ఈ క్రమంలోనే ఏడు పడగల పెదశేషునిపై విహరిస్తున్న వైకుంఠనాథుని వీక్షించి భక్తజనులు పరవశించారు. ఉభయ దేవేరీ సమేతంగా మాడవీధుల్లో ఊరేగుతున్న మలయప్పస్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. మహిమాన్విత మనోహరమూర్తిని కాంచిన కనులదే భాగ్యమంటూ పులకించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలను సమర్పించారు. ఏడుకొండలస్వామివారిని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ భక్తిశ్రద్ధలతో సేవించుకున్నారు.

– తిరుమల

న్యూస్‌రీల్

తిరుమలలో క్యూలన్నీ ఖాళీ

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,837 మంది స్వామివారిని దర్శించుకోగా 20,904 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.85 కోట్లు సమర్పించారు. క్యూలోకి వచ్చిన భక్తులను నేరుగా దర్శనానికి అనుమతిస్తున్నారు.

ప్రమాణాలు లేని 'ప్రొఫెనోఫాస్'

తిరుపతి అర్బన్ : ట్రాపికల్ అగ్రో సిస్టమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చెన్నై వారు తయారు చేసిన ప్రొఫెనోఫాస్ 40 శాతం ఈసీ, సైపర్‌మెత్రిన్ 4శాతం ఈసీ, బ్యాచ్ నెంబర్ టీపీసీబీ 250146, ట్రేడ్ పేరు పటక్ తో ఉన్న పురుగు మందులను రైతులు వాడకూడదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రామాణిక పరీక్షల్లో నిర్ధారిత ప్రమాణాలతో ఈ పురుగు మందులు లేవని గుంటూరు వ్యవసాయ సంచాలకులు స్పష్టం చేసినట్లు వెల్లడించారు.

ఉప రాష్ట్రపతికి ఘన స్వాగతం



ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. తిరుమల పర్యటనలో భాగంగా బుధవారం రాత్రి ఆయన రేణిగుంటకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎక్స్‌అఫిషియో, రెవెన్యూ సెక్రటరీ హరి జవహర్‌లాల్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఐజీ రవిప్రకాష్, విజిలెన్స్ ఎస్పీ కరీముల్లా షరీఫ్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

మట్టి తరలింపునకు చెక్

సాక్షి ఎఫెక్ట్..

చిట్టమూరు : అక్రమంగా సాగిస్తున్న మట్టి తరలింపునకు అధికారులు బుధవారం చెక్ పెట్టారు. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరుడు వల్లిపి మల్లికార్జున భూమిలో కొందరు అక్రమార్కులు మట్టిని తవ్వేసి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై సాక్షి పత్రికలో 'కళ్లగట్టి.. కడుపుకొట్టి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ నరేష్ స్పందించారు. వెంటనే మట్టి తవ్వకాలను అడ్డుకోవాలని వీఆర్‌ఓ శివయ్యను ఆదేశించారు. ఈ మేరకు వీఆర్‌ఓ ఘటనాస్థలానికి వెళ్లి జేసీబీ, ట్రాక్టర్‌ను పంపించేశారు.

పిల్లలు.. వృద్ధులకు 'జియో ట్యాగ్'



తప్పిపోయిన వృద్ధులతో పోలీసులు

తిరుమల: తిరుమలలో పిల్లలు, వృద్ధులు తప్పిపోకుండా డిజిటల్ జియో ట్యాగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. బుధవారం ఈ మేరకు ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో 20,350 మందికి ట్యాగ్‌లు కట్టారు. ట్యాగింగ్ కారణంగా పిల్లలు, వృద్ధులు తప్పిపోతే వెంటనే గుర్తించేందుకు సాధ్యమవుతుందని పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలోనే బుధవారం తప్పిపోయిన ఏడుగురు వృద్ధులను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సమ్మెకు సై



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై అక్కసుతో కూటమి సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. గ్రామ స్వరాజ్య సాధనను నీరుగారుస్తోంది. ప్రతిష్టాత్మక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. అందులో భాగంగా ఉద్యోగులను తీవ్రంగా ఇబ్బందిపెడుతోంది. అర్థం పర్థం లేని సర్వేలతో వేధిస్తోంది. ప్రజా సేవలను గాలికి వదిలేసి ఇష్టారాజ్యంగా సిబ్బందిని వినియోగించుకుంటోంది. చిన్నపాటి పొరబాట్లకు సైతం మెమోలు జారీ చేస్తూ మానసిక క్షోభకు గురిచేస్తోంది. ఈ క్రమంలోనే ప్రభుత్వ వైఖరిపై సచివాలయ ఉద్యోగులు రగిలిపోతున్నారు. సంబంధం లేని విధులు అప్పగించడంపై మండిపడుతున్నారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు నోటీసులు సైతం సంబంధిత అధికారులకు అందజేశారు.

- అక్టోబర్ 1 నుంచి సమ్మెకు సిద్ధమవుతున్న సచివాలయ ఉద్యోగులు
- ఇప్పటికే అధికారులకు అందిన నోటీసులు
- 30లోపు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

తిరుపతి అర్బన్ : ప్రజలకు సత్వర.. సులభతర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2022లో అక్టోబర్ 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతి నాడు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. సరిగ్గా మూడేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులు అక్టోబర్ 1వ తేదీ నుంచి సమ్మెకు సిద్ధమయ్యారు. ఆ మేరకు ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నగరపాలక కమిషనర్లకు సమ్మె నోటీసులను అందజేశారు. తమపై పనిభారం తగ్గించాలని, న్యాయమైన సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. చిన్న పొరబాట్లకు మెమో జారీ చేయడాన్ని తప్పుపడుతున్నారు. ఆగస్టులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీకి రాలేదంటూ 281 మందికి మెమోలు జారీ చేయడం సరికాదని నిలదీస్తున్నారు. గతంలో వలంటీర్లు చేసిన అన్ని పనులను తమ చేత చేయించడం న్యాయం కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీస డిమాండ్లు తీర్చకపోగా తమను చిన్నచూపు చూస్తోందని వాపోతున్నారు. సంబంధం లేని విధులు అప్పగించడమే కాక సర్వేల సందర్భంగా ఇచ్చిన దరఖాస్తులను పూర్తి చేయడం తలపోటుగా మారిందంటూ మండిపడుతున్నారు. ఈ క్రమంలోనే సమ్మెకు దిగుతున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

జిల్లా సమాచారం

గత ప్రభుత్వంలో సచివాలయాలు	691
ఉద్యోగులు	5,625 మంది
కూటమి సర్కారులో సచివాలయాలు	353
ఉద్యోగులు	3,650
వివిధ విభాగాలకు కేటాయించినవారు	1,975



తిరుపతి కార్పొరేషన్ అధికారులకు సమ్మె నోటీస్ ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

ప్రధాన డిమాండ్లు

- సర్వేల పేరుతో ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న నేపథ్యంలో పలు అవమానాల పాలవుతున్నాం. దీంతో ఆత్మగౌరవం కోల్పోతున్నాం. సర్వేల నుంచి విముక్తి కల్పించాలి.
- తమ విద్యార్హతల ఆధారంగా విధులు అప్పగించాలి.
- ఇతర శాఖల్లో కాకుండా మాతృశాఖలోనే పని చేసే అవకాశం కల్పించాలి.
- విధులనిర్వహణకు సమయపాలన కేటాయించాలి.
- సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధుల భారం నుంచి తప్పించాలి.
- 6 ఏళ్లు ఒకే క్యాడర్లో సర్వీస్ చేసిన ఉద్యోగులకు స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ప్రొబేషనరీ సమయంలో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన ప్రైమ్ టైమ్ నిర్ణయించాలి.
- సచివాలయాల్లోని ఖాళీలను భర్తీ చేయాలి.
- సర్వేలను సంబంధిత విభాగాలకు కేటాయించాలి.
- సచివాలయాల్లోని రికార్డు అసిస్టెంట్లను జేఎల్‌గా మార్పు చేయాలి.
- సీనియారిటీ ప్రకారం పారదర్శకంగా బదిలీ ప్రక్రియ చేపట్టాలి.

ఆత్మగౌరవం దెబ్బతింటోంది..



మాకు అప్పగించిన బాధ్యతలను తప్పకుండా చేస్తాం. అయితే సంబంధం లేని సర్వేలను అంటగట్టడం, ఎరువుల విక్రయాల బాధ్యతలు ఇవ్వడం, పదేపదే మెమోలు జారీ చేయడం సరికాదు. దీంతో ఆత్మగౌరవం దెబ్బతింటోంది. పోటీ పరీక్షలు రాసి ఉద్యోగం సంపాదించుకున్నాం. మాలో ఉన్నత విద్యావంతులు ఉన్నారు. మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా భావించి న్యాయమైన పనులు అప్పగించాలి. లేదంటే సమ్మె బాట పట్టడానికి సన్నాహాలు చేస్తున్నాం.

– తోటకూర కోటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు

వలంటీర్ల బాధ్యతలు ఇచ్చారు



గత ప్రభుత్వంలో 50 ఇళ్లకు ఒక వలంటీర్ పనిచేసేవారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడం, పింఛన్ల పంపిణీ, ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు తదితర కార్యక్రమాలను చేపట్టేవారు. అయితే వారిని తొలగించడంతో ఆ బాధ్యతలను పూర్తిగా సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. ప్రధానంగా ఆర్థిక, విద్య, వైద్యం, ఆధార్, బయోమెట్రిక్ తదితర సర్వేలతో భారం పెరిగిపోయింది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. అలాగే సీనియారిటీ మేరకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

– పి.పూర్ణచంద్రరావు, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులర్ సెక్రటరీ

ఉద్యమం తప్పదు



సచివాలయ ఉద్యోగుల ఉద్యమం తప్పదని తెలియజేస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఒక్క సమస్యను కూడా పరిష్కరించే దిశగా అడుగులు పడడం లేదు. ఈ నెల చివరికల్లా ప్రభుత్వం స్పందించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమ చేపట్టేదుకు సన్నద్ధమవుతున్నాం. న్యాయమైన డిమాండ్లను పరిష్క రించాల్సిన బాధ్యత సర్కారుపై ఉంది. వాటిని మాత్రమే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

– వి.విద్యాసాగర్‌రెడ్డి, తిరుపతి కార్పొరేషన్ వార్డు సెక్రటరీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు

సర్వే భారం తప్పించండి



పదుల సంఖ్యలో సర్వేలు ఇచ్చేస్తున్నారు. దీంతో ఇంటింటికీ వెళ్లి సర్వేలు చేయడానికి సమయం సరిపోతుంది. మరోవైపు సచివాలయంలో మాకు అప్పగించి బాధ్యతలు సకాలం చేస్తున్నప్పటికీ భారం తప్పడం లేదు. అన్ని విభాగాలకు చెందిన సర్వేలను సచివాలయ ఉద్యోగులకే ఇచ్చేస్తున్నారు. దీంతో ఆయా విభాగాలకు చెందిన జిల్లా అధికారులు గడువులోపు సర్వే పూర్తి చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో సర్వే ప్రక్రియలో పారదర్శకత లోపిస్తోంది. ఉద్యోగులపై అదనపు భారం పడుతోంది.

– పి.గీత, ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు

న్యాయమైన కోర్కెల కోసమే..



మేము గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. న్యాయమైన కోర్కెల కోసమే సమ్మె చేయాలని భావిస్తున్నాం. ఆ మేరకు ఇప్పటికే అధికారులుక సమ్మె సమాచారం ఇచ్చాం. మా సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదు. ప్రతి పనీ సచివాలయ ఉద్యోగులకే అప్పగించడం సరికాదు. పోటీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ఈ ఉద్యోగం పొందాం. వలంటీర్లు చేసే పనులను సచివాలయ ఉద్యోగులపైరుద్దుతున్నారు. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతోనే సమ్మెకు దిగాలని నిర్ణయించాం.

– పి.నాగమోహన్, ఎంప్లాయీస్ ఫెడరేషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి

నిరసన గళం వినిపిస్తాం



సచివాలయ ఉద్యోగుల నిరసన గళాన్ని అక్టోబర్ 1 నుంచి గట్టిగానే ప్రభుత్వానికి వినిపిస్తాం. 17 నెలలుగా ఎన్నో ఒత్తిళ్లను భరిస్తూనే ఉద్యోగాలు చేస్తున్నాం. అయినా మా సమస్యలకు పరిష్కారం లభించలేదు. మేము మనుషులమే, యంత్రాలం కాదు. మా శక్తి మించి నట్టే పనిచేస్తున్నాం. అయినా అదనపు భారం మోపుతున్నారు. పని ఒత్తిడితో పలువురు ఉద్యోగులు అనారోగ్యం భారిన పడుతున్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించాల్సి ఉంది. లేదంటే సమ్మె తప్పదు.

– ఎస్.హాలీ అక్బర్, ఎంప్లాయీస్ ఫెడరేషన్, జిల్లా కార్యదర్శి

కొత్త గురువులకు కొలువులు

- విజయవాడకు బయలుదేరిన డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు
- సీఎం చేతులమీదుగా నేడు నియామక ఉత్తర్వులు



అమరావతికి బయలుదేరుతున్న అభ్యర్థులు, ఉద్యోగులతో డీఈఓ కేవీఎన్ కుమార్

తిరుపతి సిటీ : ఇష్టారాజ్యంగా.. నిబంధనలను తుంగలోతొక్కి ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ ప్రక్రియ నిర్వహించింది. ఈ మేరకు 1,500 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది. ఇక నియామక పత్రాలు పంపిణీ చేసేందుకు మరో హంగామాకు తెరతీసింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులకు విజయవాడకులో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా నియమాకపత్రాలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే బుధవారం ప్రత్యేక బస్సుల్లో అభ్యర్థులను తరలించే ప్రక్రియ చేపట్టింది. ఇందు కోసం రెండు రోజుల నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు జిల్లా అధికారులు ఫోన్‌లు, మెసేజ్‌ల ద్వారా సమాచారం అందించారు. ఖచ్చితంగా విజయవాడలో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని హుకుం జారీ చేశారు.

50మంది గైర్హాజరు

మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు ఇప్పటికే పలు మార్లు జిల్లా అధికారులు పలు మార్లు నిబంధనలు విధించారు. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీన విజయవాడుకు వెళ్లాలంటూ ప్రతి ఒక్క అభ్యర్థికి మెసేజ్‌లు పంపారు. కానీ ఆరోజు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో కార్యక్రమం అధికారులు రద్దు చేశారు. దీంతో అప్పటికే హాజరైన అభ్యర్థులు నిరుత్సాహంతో వెనుదిరిగారు. దీంతో మరో మారు ఈనెల 25వ తేదీన సీఎం చేతుల మీదుగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తామని ప్రకటించారు. దీంతో అభ్యర్థులు తమ పనులను వదులుకుని డీఈఓ ఆదేశాల మేరకు రేణిగుంట రోడ్డులోని చదలవాడ కళాశాలకు హాజరయ్యారు. 50మంది అభ్యర్థులు తమ సొంత కారణాలతో హాజరు కాలేపోతున్నామంటూ డీఈఓకు విన్నవించారు.

ప్రోగ్రామ్ సక్సెస్



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మెగా డీఎస్సీలో ఎంపికై న అభ్యర్థులు సీఎం చేతుల మీదుగా నియామకపత్రాలను అందుకునేందుకు ముందుకు వచ్చారు. అలాగే విద్యాశాఖకు చెందిన సుమారు 3వేల మందితో 80 బస్సులలో అమరావతికి బయలు దేరుతున్నాం. అభ్యర్థులు, ఉద్యోగులకు విద్యాశాఖ తరఫున అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం. భోజన వసతితో పాటు, మళ్లీ స్వస్థలాలకు వారి చేర్చే బాధ్యత విద్యాశాఖ తీసుకుంటుంది.

– కేవీఎన్ కుమార్, డీఈఓ, తిరుపతి

'న్యాయమిత్ర' అమలుకు డిమాండ్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న న్యాయవాదులు

తిరుపతి లీగల్ : ఎన్నికల సమయంలో న్యాయవాదులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా అఖిల భారత న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం తిరుపతి కోర్టు ఆవరణలో డిమాండ్లతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ గతంలో వైఎస్సార్‌సీపీ న్యాయమిత్ర పథకం కింద అందిస్తున్న రూ.5వేలను పెంచి రూ.10వేలు అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. అలాగే లబ్ధిదారుల సంఖ్య 2,670 నుంచి 3,500లకు పెంచుతామని మాట ఇచ్చారని వెల్లడించారు. రూ.100 కోట్లతో న్యాయవాదుల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తామని, రూ.5లక్షల ఆరోగ్య భీమా, రూ.15 లక్షల ప్రమాద బీమా కల్పిస్తామని ప్రకటించారని వివరించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా న్యాయమిత్ర పథకానికే దిక్కులేకుండా పోయిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కోరారు. సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హేమ చంద్రారెడ్డి, కార్యదర్శి పి.మురళి, కార్యవర్గ సభ్యులు దేవరాజులు, హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.117,400
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.1.0,581

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.1,38,600
రిటైల్ వెండి గ్రాము	రూ.141.60

క్లుప్తంగా

ఇద్దరు బాలురు అదృశ్యం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం ఉయ్యాలపల్లెలో బుధవారం సాయంత్రం ఇద్దరు బాలురు అదృశ్యమయ్యారు. వివరాలు.. ఎన్‌విష్ణువర్ధన్(11), నవశ్రావణ్(12) అనే ఇద్దరు పిల్లలు గ్రామ సమీపంలోని చెరువు వద్దకు కలేక్కాయల కోసం వెళ్లారు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రయోజనం లేకుండా పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రాపూరు, కలువాయి పోలీసులు టార్చ్ లైట్లతో గాలింపు మొదలుపెట్టారు.

కనుమలోకి దూసుకెళ్లిన ఐషర్

– డ్రైవరు, క్లీనర్‌కు గాయాలు



లోయలో బోల్తా పడిన వాహనం

చంద్రగిరి : తిరుపతి– మదనపల్లె జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఐషర్ వాహనం అదుపుతప్పి భాకరాపేట కనుమలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అనంతపురం నుంచి ఐషర్ వాహనంలో దోసకాయల లోడ్‌తో డ్రైవర్ వంశీ మంగళవారం బయల్దేరాడు. భాకరాపేట కనుమలోకి ప్రవేశించగానే వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవరుతో పాటు క్లీనర్ శ్యామ్ గాయపడ్డాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు లోయలో పడిపోయిన క్షతగాత్రులను వెలికితీసి 108లో తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి సంఘాల సహకారం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎట్టకేలకు పీజీసెట్–2025 ప్రక్రియ ప్రారంభమైంది. వర్సిటీలో సీటు పొందిన పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులతో బుధవారం వర్సిటీ కళకళలాడింది. రాయలసీమలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన విదార్థులకు వర్సిటీ అధికారులు కనీసం హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయకపోయినా ఆ బాధ్యతను విద్యార్థి సంఘాలు నిర్వర్తించి ప్రశంసలు మన్ననలు అందుకున్నాయి. ఎస్ఎఫ్ఐ వర్సిటీల కో–ఆర్డినేటర్ అశోక్ మాట్లాడుతూ, తాము ప్రత్యేకంగా కౌంటర్లు నిర్వహించి వర్సిటీలో నూతన ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు.



పెద్దశేషునిపై కొలువుదీరిన దేవదేవేరులు



ఆలయంలోకి వెళుతున్న భక్తులు

కల్యాణ వెంకన్న వైభవం

- తుమ్మలగుంటకు బ్రహ్మోత్సవ శోభ
- పెదశేషునిపై ఊరేగిన దేవదేవేరులు



వాహనసేవలో కేరళ వాయిద్యాలు

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు బుధవారం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. శోభాయమానంగా అలంకరించిన దేవదేవేరులను పెదశేష వాహనంపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు.. గోవిందనామస్మరణల నడుమ కనులపండువగా ఊరేగించారు. ఉభయదేవేరీ సమేతంగా విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కర్పూరహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాలను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పాకాల మండలం నుంచి సారె తీసుకువచ్చిన భక్తులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. – తిరుపతి రూరల్



దర్శనానికి విచ్చేసిన వేద పాఠశాల విద్యార్థులు

సమీకృత వ్యవసాయ విధానాలతో ఆదాయం



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాముకుమార్

తిరుపతి కల్చరల్: సమీకృత వ్యవసాయ విధానాలను పాటిస్తే రైతులు మంచి ఆదాయం పొందగలరని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త రాముకుమార్ అన్నారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రాస్ సేవా నిలయంలో బుధవారం 'సమీకృత వ్యవసాయ విధానంపై' రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పంటలు, పశుగ్రాసం, పశుపోషణ, గొర్రెలు, కోళ్లు, పొట్టేళ్లు, చేపల పెంపకం, డ్రోన్ల వాడకం ..ఇత్యాది అంశాలపై అవగాహన కల్పించారు. రాస్ ప్రాజెక్టు ప్రతినిధులు కరుణాకర్, సీపీ.నాయుడు, ప్రాజెక్టు ప్రతినిధి మంజునాథ్, చిన్నగొట్టిగల్లు, రొంపిచర్ల మండలాలకు చెందిన 50 మంది రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం





పన్నీరు కాల్వ రహదారిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలు

రేణిగుంట: మండలంలోని తిరుపతి–చెన్నై రోడ్డులోని తూకివాకం పంచాయతీ పన్నీరు కాల్వకు వెళ్లే దారిలో సర్వే నంబర్ 929లో విలువైన 1.36 ఎకరాల కాలువ పోరంబోకు స్థలంపై అధికార పార్టీ నాయకులు కన్నేశారు. అమ్మవారి ఆలయం పేరిట నిర్మాణం చేస్తున్నారు. ఇదే అదునుగా మరికొందరు పక్కనే గడ్డివాములు వేసి ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

● అధినేతతో జిల్లా నేతలు







తాడేపల్లెలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, సమన్వయకర్తలు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, భూమన అభినయ్ రెడ్డి

'నారాయణ' ఎదుట తల్లిదండ్రుల నిరసన



కళాశాల గేటు వద్ద బైక్‌లను అడ్డుగా పెట్టి నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బుధవారం సుమారు గంటన్నరపాటు విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది కాలేజీ గేట్లు తీయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు.. కళాశాలలో సుమారు 3వేల మంది విద్యార్థులు ఉన్నారు. కాలేజీ గేటు నుంచి మెయిన్ బిల్డింగ్‌కు 1.5 కిలోమీటర్లు ఉంటుంది. బస్సులో వచ్చేవారు, బైక్‌లపై తల్లిదండ్రుల వెంట వచ్చేవారు రోజూ మెయిన్ బిల్డింగ్ వరకు వెళుతుంటారు. అయితే ఆ రోడ్డుకు మరమ్మతులు చేస్తుండడంతో వాహనాలను లోపలికి అనుమతించవద్దని సెక్యూరిటీ సిబ్బందిని కాలేజీ నిర్వాహకులు ఆదేశించారు. దీంతో బైక్‌లపై పిల్లలతో వచ్చిన తల్లిదండ్రులను సెక్యూరిటీ వారు లోపలికి అనుమతించలేదు. దీనిపై తల్లిదండ్రులు మండిపడ్డారు. తమ బిడ్డలు అంతదూరం నడిచివెళ్లాంటే ఇబ్బందని ఆవేదన వ్యక్తం చేశారు. గేటుకు అడ్డుగా బైక్‌లను పార్క్ చేసి ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కళాశాల ఏఓ కొండారెడ్డి అక్కడకు రావడంతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఆయన ఆగ్రహించి మీరు కట్టే ఫీజులతోనే కాలేజీ నడుస్తోందా అని వ్యాఖ్యానించడంతో తల్లిదండ్రులు తీవ్రంగా మండిపడ్డారు. తాము చెల్లించే ఫీజులతోనే కళాశాల నడుస్తోందని, మా పిల్లలు రాకపోతే మీ పరిస్థితి ఏంటని నిలదీశారు. ఇంతలో ప్రిన్సిపల్ రవిప్రసాద్ అక్కడకి చేరుకోవడంతో మరో సారి తల్లిదండ్రులు అడ్డుపడ్డారు. దీంతో ఆయన తన చాంబర్ వద్దకు వస్తే మాట్లాడుకుందామని చెప్పారు. ఒకటిన్నర గంటల నుంచి ఎండలో గేటు వద్ద నిలబడి ఉంటే, సమాధానం చెప్పకుండా చాంబర్‌కు రమ్మనడం ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయన మరో రెండు నెలలపాటు ఇబ్బంది తప్పదని, సహకరించాలని కోరడంతో తల్లిదండ్రులు వెనుదిరిగారు.

సమయపాలన పాటించని అధికారులు

– సోషల్ మీడియాలో పోస్టులు



విధులకు హాజరైన ఒకే ఒక్క ఉద్యోగి

చంద్రగిరి: మండలంలోని దోర్నకంబాల సచివాలయ ఉద్యోగులు సమయపాలనకు తిలోదకాలిచ్చేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలైనా ఒకే ఒక్క అధికారి మినహా తక్కిన వారెవరూ హాజరు కాకపోవడంపై స్థానికులు సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. 10 మంది ఉద్యోగులకు గాను ఒక్కరే రావడం ఇదేమీ కొత్త కాదని, ప్రతి రోజూ ఉద్యోగులు ఇలాగే వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరు సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హాజరు కాని వైద్యులు..!

దోర్నకంబాలలో బుధవారం స్వస్థ్ నారీ..పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు హాజరు కాలేదు. శిబిరంలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లే వైద్యుల అవతారం ఎత్తి సేవలు అందించారు.

ప్రైవేటు బస్సు బోల్తా

- బెంగళూరుకు చెందిన 22 మందికి గాయాలు



గాయపడ్డ ప్రయాణికులు



క్షతగాత్రులను అంబులెన్సులో తరలిస్తున్న దృశ్యం

పూతలపట్టు (యాదమరి) : పూతలపట్టు మండలం పాలమూరు సమీపంలో బెంగళూరు–తిరుపతి జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడిన ఘటనలో 22 మంది ప్రయాణికులు గాయపడ్డారు. అదృష్టవశాత్తు పెను ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు... బెంగళూరు నుంచి తిరుపతి వైపుగా 40 మంది ప్రయాణికులతో ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో అతి వేగంతో ప్రయాణిస్తున్న బస్సు పూతలపట్టు మండల పరిధి పాలమూరు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వెళ్తున్న ఓ ఐచర్ వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో మొత్తం 22 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిలో బెంగళూరుకు చెందిన హైమ, పుష్పవతి, సౌభాగ్య, భారతి, దివ్యశ్రీ, సంపూర్ణ, లత, సునిత, లక్ష్మి, లీలావతి, మునిరాజ్, సాంసన్, వెంకటరమణ, అరుణ్‌కుమార్, ఉదయ్, మునిసోమేష్, సంజన్, కృష్ణమూర్తి, లవ, మోహిత్ రావు, శ్రీనివాసులు, వినయ్ ఉన్నారు. గాయపడ్డవారిని స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 108 వాహనం ద్వారా క్షతగాత్రులను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని వెలికి తీస్తున్న గ్రామస్తులు

కలువాయి(సైదాపురం) : మండలంలోని కేశమనేనిపల్లె గ్రామానికి చెందిన చెలమచర్ల శ్రీనివాసులు (28) ఈనెల 22వ తేదీన ప్రమాదవశాత్తు తెలుగుగంగ కాలువలో పడి గల్లంతైన విషయం విధితమే. అప్పటి నుంచి మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం దాచూరు సమీపంలోని కండలేరు డ్యామ్‌లో లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాపూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆదిశక్తి అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన బుధవారం అమ్మవారు ఆదిశక్తి పార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు గోవర్ధనశర్మ, తదితర అర్చక బృందం అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట ఈఓ ఏకాంబరం, ఉభయదారులతో కలిసి హోమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రయోగశాల భవన నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూ రూసా నిధుల ఫేజ్ 2.0లో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద కొత్తగా మంజూరైన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రయోగశాల నిర్మాణానికి బుధవారం వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు భూమి పూజ చేశారు. వీసీ మాట్లాడుతూ, రూ. 6కోట్లతో ప్రయోగశాల భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ ఆచార్య నరసింహ, ఆచార్య బాలాజీ , ప్రిన్సిపాళ్లు ఆచార్య పద్మావతి, భాస్కర్ రెడ్డి, రూసా సీఈఓ వంశీ, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ ఫార్మాకో విజిలెన్స్ వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో వారం రోజుల ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ మానిటరింగ్ సెంటర్, ఫార్మకాలజీ విభాగం, ఫార్మాకో విజిలెన్స్ ప్రోగ్రామ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు మాట్లాడారు. ప్రజలకు ఔషధాల వాడకం, రోగుల రక్షణపై అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ చేశారు. పోస్ట్‌గ్రాడ్యుయేట్, ఎంబీబీఎస్, హెల్త్ సైన్సెస్ విద్యార్థులకు ఇ–పోస్టర్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణమూర్తి, డాక్టర్ భారతి, డాక్టర్ వై.లక్ష్మి, డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖాకీ–చకుడు

- బాధితురాలిపై పోలీసుల లైంగిక దాడి?
- కానిస్టేబుల్‌ను కాపాడేందుకు ప్రయత్నాలు
- ఎస్పీని కలిస్తేగానీ ఎఫ్ఐఆర్ నమోదు చేయని పోలీసులు



పలమనేరు : ప్రజలను కాపాడాల్సిన పోలీసులే నిందితులుగా మారి ఓ మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన జిల్లాలోనే కలకలం రేపుతోంది. పలమనేరు పట్టణంలోని గంటావూరు కాలనీకి చెందిన ఓ మహిళపై కానిస్టేబుల్ అడవిలో లైంగిక దాడి చేసిన ఘటన ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది.

అసలు ఏం జరిగిందంటే....

గంటావూరుకు చెందిన ఓ మహిళకు ముగ్గురు పిల్లలున్నారు. భర్త వేధింపులతో ఆమె నాలుగు నెలల క్రితం పలమనేరు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లింది. బాధితురాలు అందంగా ఉందని కన్నేసిన అక్కడి సీఐ డ్రైవర్‌గా పనిచేస్తున్న హోంగార్డు కిరణ్‌కుమార్ ప్లాన్ చేశాడు. (ప్రస్తుతం సోమలలో పనిచేస్తున్నాడు.) ఫిర్యాదులోని ఫోన్ నంబరును తీసుకుని తాను న్యాయం చేస్తానంటూ బాధితురాలికి రాత్రుల్లో ఫోన్ చేయడం మొదలు పెట్టాడు. దీంతో బాధితురాలు తనకు తెలిసిన వారి ద్వారా పలమనేరులో పనిచేసే మరో కానిస్టేబుల్ ఉమాశంకర్‌కు (ఇప్పుడు పుంగనూరులో విధులు నిర్వహిస్తున్నాడు.) తన బాధను తెలుపుకుంది. దీన్ని ఆసరాగా తీసుకున్న ఆ కానిస్టేబుల్ కూడా నేరుగా బాధితురాలి ఇంటికెళ్లి ఎలాంటి సమస్య లేకుండా చూసుకుంటానంటూ నమ్మబలికాడు. ఆపై అతడు కూడా రాత్రుల్లో ఫోన్లు చేయడం మొదలు పెట్టాడు. బాధితురాలిచ్చిన ఫిర్యాదు దేవుడెరుగు ఆ ఇద్దరి వేధింపులతో ఏం చేయలేని బాధితురాలు తీవ్రంగా మనోవేదన అనుభవించింది.

ఎస్పీని కలిసి న్యాయం చేయాలని...

తనకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీసులు ఎలాగూ న్యాయం చేయరని భావించి తాజాగా జిల్లా ఎస్పీగా వచ్చిన తుషార్‌డూడిని ఇటీవలే కలిసి జరిగిన ఘోరంపై బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఆయన వెంటనే దీనిపై విచారణ చేయాలని పలమనేరు సీఐ మురళీమోహన్‌కు అప్పజెప్పారు. సంఘటన జరిగింది తన పరిధి కాదని బంగారుపాళెం సీఐని కలవాలని ఆయన చెప్పారు. దీంతో బాధితురాలు బంగారుపాళెం సీఐని కలిసింది. ఆ కానిస్టేబుల్‌కు అధికార పార్టీ అండదండలు ఉండడం, నిందితుడు పోలీసు కావడంతో అప్పట్లో ఎఫ్ఐఆర్ వేయకుండా కాలయాపన చేశారు. ఎస్పీని కలిసినా న్యాయం జరగలేదని ఆవేదన చెందిన బాధితురాలు బుధవారం చిత్తూరులో ప్రెస్‌మీట్ పెట్టి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించింది. విషయం మీడియాకు చేరడంతో వెంటనే స్పందించిన పోలీసులు బుధవారమే ఎఫ్ఐఆర్ వేశారు. ముందే ఎందుకు కేసు నమోదు చేయలేదనే ప్రశ్న ఇప్పుడు అందరిలో వినిపిస్తోంది. పోలీసులకైతే ఓ న్యాయం సామాన్యులకైతే మరో న్యాయమా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా కొందరు కానిస్టేబుళ్ల కారణంగా మొత్తం పోలీసు వ్యవస్థకే ప్రజల్లో నమ్మకం లేకుండా పోతోంది. దీనిపై జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ అయినా వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బిడ్డలతో సహా ఆత్మహత్య చేసుకోవాలని...

భర్త వదిలేయడం, న్యాయం కోసం వెళ్తే ఓ కానిస్టేబుల్, హోంగార్డు లైంగిక వేధింపులతో బతకడం ఇష్టంలేక మొగిలి సమీపంలోని దేవరకొండలో ఆలయం వద్ద ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకొని రెండునెలల కిందట వెళ్లింది. కొండపైకి గస్తీ కోసమెళ్లిన బంగారుపాళెం పీఎస్‌కు చెందిన ఇరువురు కానిస్టేబుళ్లు బాధితురాలిని చూసి అడవిలో ఎందుకున్నట్టని ఆరా తీశారు. తనది పలమనేరని చెప్పగా తెలిసినవారెవరైనా ఉన్నారా అనగానే మీ కానిస్టేబుళ్లనే అడగడంటూ ఆమెను వేధిస్తున్న కానిస్టేబుల్ నంబరు ఇచ్చింది. దీంతో వారు అతడికి కాల్ చేయగా ఆమె తనకు తెలుసునని చెప్పడంతో వారు వెళ్లిపోయారు. దీన్ని అదునుగా భావించిన ఆ కానిస్టేబుల్ ఓ కారులో ఇక్కడికి చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. ఆత్మహత్య చేసుకోవడం కరెక్ట్ కాదని సముదాయించి పిల్లలతో పాటు బాధితురాలికి మద్యం కలిపిన కూల్‌డ్రింక్ బాటిళ్లను ఇచ్చి వారు మత్తులో ఉండగా పిల్లలను కారులో పడుకోబెట్టి బాధితురాలితో పాటు కొండపైనుంచి కిందికి వస్తూ అడవిలోని మరో దారిలోకి తీసుకెళ్లి అక్కడ బాధితురాలిపై లైంగిక దాడి చేసినట్టు తన ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. జరిగిన విషయంపై ఎవరికైనా చెబితే ప్రాణాలతో ఉండరని బెదిరించడంతో బాధితురాలు ఏం చేయలేకపోయింది.